కర్నూలు సీమకిరణం నంద్యాల
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com




# చెవి.. ముక్కు.. గొంతు వైద్యానికి కొత్త దిశ

అధునాతన చికిత్సా విధానాలు, శస్త్రచికిత్స పద్ధతులపై నిపుణుల అవగాహన

కర్నూలులో నేటి నుంచి 44వ రాష్ట్రస్థాయి ఈ ఎన్ టి సదస్సు

మూడు రోజుల పాటు సదస్సు, వర్క్‌షాప్‌లు.. రాష్ట్రవ్యాప్తంగా పాల్గొననున్న ఈ ఎన్ టి వైద్య నిపుణులు









**కర్నూలు వైద్యం, సెప్టెంబర్ 10, (సీమకిరణం న్యూస్):** కర్నూలు మెడికల్ కాలేజీలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో 44వ ఈ ఎన్ టి (చెవి, ముక్కు, గొంతు) రాష్ట్రస్థాయి సదస్సు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు గురువారం కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరి చరణ్‌ను కలిసి సదస్సు బ్రోచర్‌ను అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈ ఎన్ టి విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ, ఏవో ఐ కర్నూలు ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహేంద్ర కుమార్‌లు ప్రిన్సిపల్‌ను కలిసి మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. సదస్సుకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌తో పాటు ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ తదితర ప్రముఖులు అతిథులుగా హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఎన్ టి వైద్య నిపుణులు, వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. మొదటి రోజు నిర్వహించే ప్రీ-కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌లలో ఈ ఎన్ టి వైద్యరంగానికి సంబంధించిన వివిధ ప్రొసీజర్లు, పరీక్షలు, ఆధునిక చికిత్సా విధానాలు, శస్త్రచికిత్సా పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై వైద్యులకు అవగాహన కల్పించనున్నారు. మానవ నమూనాలపై వివిధ వైద్య ప్రక్రియలను ప్రాక్టికల్‌గా వివరించనున్నారు. ఈ రాష్ట్రస్థాయి సదస్సు ద్వారా ఈ ఎన్ టి వైద్యరంగంలో అందుబాటులోకి వస్తున్న తాజా, అధునాతన వైద్య పరిజ్ఞానాన్ని వైద్యులకు అందించడంతో పాటు, వైద్య నిపుణుల మధ్య అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం పరస్పరం మార్పిడి చేసుకునే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక రాష్ట్రస్థాయి సదస్సుకు కళాశాల తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరి చరణ్ నిర్వాహకులకు హామీ ఇచ్చారు.

# జీవితం అమూల్యమైనది - ఆశయంతో ముందుకు సాగండి







**డోన్ టౌన్, సెప్టెంబర్ 10,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలో గురువారం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ శంషాద్ బేగం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రా ప్రదేశ్ బి.సి. గురుకుల పాఠశాల నందు ప్రపంచ ఆత్మ హత్యల నివారణ దినోత్సవం-2026, బాల్య వివాహల కలిగే నష్టాలు, పాక్సో చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శంషాద్ బేగం మాట్లాడుతూ బాలికలు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా బాగా చదివి ఉన్నత స్థాయి ఉద్యోగులుగా కావాలని తెలిపారు. ఏదైనా సమస్య వస్తే ధైర్యంగా ఎదుర్కునే సామర్థ్యం మీలో ఉండాలని ప్రతి విషయము తల్లి తండ్రులకు చెప్పాలని తెలిపారు అలాగే పిల్లలు రక్త హీనతకు గురికాకండ తీసుకోవాల్సిన జాగ్రత్తలు అలాగే న్యూట్రిషన్ పై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ విభాగం - ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జీవితం చాలా విలువైనదని పదవ తరగతి లో ఫెయిల్ అయిన మార్కులు సరిగ్గా రాలేదని ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని ఆత్మహత్య పరిష్కారం కాదని అలాంటి వారు ఒంటరి వారు కాదని ఇందుకోసం 14416 టెలి మానస్ హెల్ప్ లైన్ 24 గంటలు పని చేస్తుందని తెలిపారు అలాగే పిల్లలకు బాలల హక్కులు అయిన

1. జీవించే హక్కు
2. రక్షణ పొందే హక్కు
3. అభివృద్ధి చెందే హక్కు
4. భాగస్వామ్య హక్కుల గురించి బాలికలకు వివరించారు.

అలాగే ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుందని తెలిసిన చూసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి , పోలీస్ హెల్ప్ లైన్100 కి, ఉమెన్ హెల్ప్ లైన్181 నంబర్లకు కాల్ చేసి చెప్పవచ్చు అన్నారు. చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుంది అని తెలిపారు. ప్రస్తుతం బాలికలు సమాజం ఎదుర్కుంటున్న సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అని వివరించారు. తదుపరి ×జణా సూపర్వైజర్ పరమేశ్వరి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని ఒక్క చదువు ద్వారానే సమాజం లో బాలికల గౌరవం పెరుగుతుందని మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం పిల్లల మంచి భవిష్యతు కోసం కొన్ని కోట్లు ఖర్చుపెడుతుంది అని తల్లికి వందనం లాంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును తీర్చిద్దుకోవాలని తెలిపె రు. రఘు నాయక్ (మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్-2) మాట్లాడుతూ బడికి రోజు రావడం ద్వారా మంచి చదువుతూ పాటు , మంచి గుణాలు వస్తాయని బాగా చదవడం ద్వారా బాల్య వివాహాలను కూడా అరికట్టోచు అని తెలిపారు. అపరిచితుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని ఎవరిని అంత త్వరగా నమ్మకూడదని మిమ్మల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే తల్లితండ్రులకి లేదా టీచర్లకు చెప్పాలని తెలిపారు. బాలికల. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులు రజియా, హరిత మరియు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామళ్లకోటలో జాతీయ పోషణ మాసం కార్యక్రమం





**వెల్దుర్తి, సెప్టెంబర్ 10 (సీమకిరణం న్యూస్):** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం ప్రాజెక్టు సెక్టార్‌లోని రామళ్లకోట ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తొమ్మిదో జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మన అంగన్‌వాడీ మన బాధ్యత' అనే అంశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి శిశు అభివృద్ధి పథక అధికారి లూక్, పర్యవేక్షకురాలు శ్రీదేవి హాజరై తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లల తల్లులు, మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లల తల్లులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆహార వైవిధ్యం, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాల ప్రాధాన్యతను వివరించారు. పోషక విలువలు కలిగిన వంటకాల ప్రదర్శన నిర్వహించి, ప్రాంతీయ సంప్రదాయ వంటకాల ప్రాధాన్యతను తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు తాజాగా వండి వేడివేడిగా భోజనం అందించడం, జరిగింది పౌష్టికాహార మెనూ అమలు, అదనపు పౌష్టికా ఆహారం వంటకాల ప్రదర్శన, మెనూ పట్టికల ప్రదర్శన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో కమిటీల భాగస్వామ్యం, పిల్లలకు పౌష్టికాహారం అందించడం, జరిగింది బాలల సమగ్ర అభివృద్ధి కోసం విద్య, ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. ఆరోగ్య దినోత్సవాల్లో అభివృద్ధిలో జాప్యం ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన వైద్య సేవలకు పంపించడం, చిన్నారుల సంరక్షణ మరియు ప్రాథమిక అభ్యాసంలో సమాజ భాగస్వామ్యం పెంచడం వంటి అంశాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల వెలుపల చిన్నారులకు ఎత్తుకు అనుగుణంగా అద్దాలను ఏర్పాటు చేయడం వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా పిల్లల్లో స్వీయ అవగాహన, అభివృద్ధికి ప్రోత్సాహం కల్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న నగదు ప్రోత్సాహకాల గురించి వివరించారు. మాతృ ఆరోగ్య పరిరక్షణకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని, అర్హులైన లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన సమాచార పుస్తకాన్ని కూడా కార్యక్రమంలో పరిచయంచేశారు. ఈకార్యక్రమంలో పర్యవేక్షకురాలు శ్రీదేవి, నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన తల్లులు, సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని తొమ్మిదో జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వినాయక విగ్రహాలు 6 గంటల్లోపు పట్టణానికి తీసుకురావాలి



వినాయక విగ్రహాల నిర్వాహకులకు విద్యుత్ శాఖ విజ్ఞప్తి

**వెల్దుర్తి, సెప్టెంబర్ 10 (సీమకిరణం న్యూస్):** వెల్దుర్తి గ్రామ ప్రజలకు, వినాయక ఉత్సవ నిర్వాహకులకు విద్యుత్ శాఖ అధికారులు ముఖ్య విజ్ఞప్తి చేశారు. పెద్ద వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు సాయంత్రం 6 గంటలలోపు విగ్రహాలను తమ మండపాలవద్దకుతరలించుకోవాలని సూచించారు.ప్రస్తుతం విద్యుత్సరఫరాపరిస్థితిఅంతంతమాత్రంగానే ఉన్నందున, విగ్రహాల తరలింపు కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అందువల్ల నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని సాయంత్రం 6 గంటలలోపు విగ్రహాలను తీసుకెళ్లాలని కోరుచున్నారు ఈ మేరకు వెల్దుర్తి విద్యుత్ శాఖ ఏఈఓ ప్రకటన విడుదల చేశారు.

## ముద్దాయి మస్తాన్‌వలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు




**వెల్దుర్తి, సెప్టెంబర్ 10, (సీమకిరణం న్యూస్):** వెల్దుర్తి టౌన్‌లోని ఐజీ నగర్‌లో గతవారం జరిగిన ఘటనలో మృతుడు షేక్షావలి కుమారుడు మస్తాన్‌వలిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఐజీ నగర్‌లోని మదీనా మసీదు ఎదురుగా ఉన్న ఇంటిలో షేక్షావలి తన భార్య మస్తాన్ బీ గొంతు పట్టుకోవడంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఆమె అరుపులు విని బయట ఉన్న పెద్ద కుమారుడు మస్తాన్‌వలి ఇంట్లోకి వచ్చి చూడగా తల్లి స్పృహ కోల్పోయి ఉండటాన్ని గమనించాడు. ఆవేశానికి గురైన మస్తాన్‌వలి వంటగదిలో ఉన్న రోకలిబండతో తన తండ్రి షేక్షావలిపై దాడి చేశాడు. ఈ దాడిలో షేక్షావలి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు.. మస్తాన్‌వలి గురువారం ఇంటి వద్ద ఉన్న సమయంలో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## రాష్ట్ర అభివృద్ధిపై సమగ్ర కార్యాచరణ



8వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో మంత్రి టీజీ భరత్

**అమరావతి, సెప్టెంబర్ 10, (సీమకిరణం న్యూస్):** రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, జి ఎస్ డిపి వృద్ధి, తాగునీటి వసతుల కల్పన, గృహ నిర్మాణం, జలధార కార్యక్రమంతో పాటు వివిధ జిల్లాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన పాలన, సంక్షేమ ఫలాలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా శాఖలు, జిల్లాల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై మంత్రులు, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో చర్చించారు.

## విద్యుత్ కోతలు వెంటనే నిలిపివేయాలి

కొవ్వొత్తులతో గ్రామ ప్రజల నిరసన.. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**వెల్దుర్తి, సెప్టెంబర్ 10, (సీమకిరణం న్యూస్):** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలోని రత్నపల్లి గ్రామంలో గత వారం రోజులుగా ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు విద్యుత్ కోతలు విధించడంపై గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 5 వేల మంది ప్రజలు విద్యుత్ కోతల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల నాయకులు పులికంటి నాగరాజు, డప్పు కళాకారుల సంఘం మండల కార్యదర్శి మధు తెలిపారు. రాత్రివేళల్లో విద్యుత్ లేక రహదారులు చీకటిమయంగా మారుతున్నాయని, దీంతో పిల్లలు, వృద్ధులు ప్రమాదాలకు గురై మురుగు కాలువల్లో పడిపోయి గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం గ్రామ ప్రజలు సుంకన్న, శేఖర్, మౌలాలి, ఎల్ల రాజు తదితరుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. రత్నపల్లి గ్రామంలో విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేసి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని , మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు రహదారులు, వీధి దీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు.

## జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల సత్తా

నేషనల్‌కు రెండు సైన్స్ ప్రాజెక్టులు ఎంపిక

మస్కిటో ట్రాపర్ తో అబ్దుల్ గఫూర్, డ్రైనేజ్ కెనాల్ క్లీనర్ తో కృష్ణ అదుర్స్



**ప్యాపిలి, సెప్టెంబర్ 10 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ జాతీయ స్థాయిలో మెరిసింది. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రూపొందించిన రెండు వినూత్న ప్రాజెక్టులు నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్ కు ఎంపికయ్యాయి. విద్యార్థి అబ్దుల్ గఫూర్ రూపొందించిన మస్కిటో ట్రాపర్' (దోమలను పట్టే పరికరం) పరిశీలకులను విశేషంగా ఆకట్టుకుంది. రసాయనాలు లేకుండా, తక్కువ ఖర్చుతో దోమల బెడదను నివారించేలా ఈ పరికరాన్ని రూపొందించాడు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని న్యాయనిర్ణేతలు ప్రశంసించారు. మరో విద్యార్థి కృష్ణ రూపొందించిన 'డ్రైనేజ్ కెనాల్ క్లీనర్' కూడా జాతీయ స్థాయికి ఎంపికైంది. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను మనుషులు లోపలికి దిగకుండానే సులభంగా తొలగించేలా ఈ యంత్రాన్ని రూపొందించాడు. పారిశుధ్య కార్మికుల కష్టాలను తీర్చడంతో పాటు స్వచ్ఛ భారత్ లక్ష్యానికి తోడ్పడేలా ఉందని ప్రశంసలు అందుకుంది. అదేవిధంగా విద్యార్థులకు మార్గదర్శి అయిన ఉపాధ్యాయుడు శేఖర్ నీ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు జాతీయ స్థాయికి ఎంపికైన ఈ ఇద్దరు విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం పద్మాబాయి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఘనంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా సైన్స్ రంగంలో అద్భుతాలు సృష్టించగలరని నిరూపించారని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## పత్రికా స్వేచ్ఛను అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

సీపీఐ




**ప్యాపిలి, సెప్టెంబర్ 10 (సీమ కిరణం న్యూస్) :** నంద్యాల పట్టణంలో జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేసి, అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం సమంజసం కాదని సీపీఐ ప్యాపిలి మండల కార్యదర్శి జె. మహేష్ తీవ్రంగా ఖండించారు. భూముల ఆక్రమణలు, మట్టి తవ్వకాల అక్రమాలపై వార్తలు రాసినందుకే జర్నలిస్టులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా పత్రికా స్వేచ్ఛను అణచివేయాలని ప్రయత్నిస్తే సీపీఐ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాలుగో స్థంభమని, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులపై దౌర్జన్యపూరిత చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మహేష్ అన్నారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యులను సైతం భయాందోళనలకు గురిచేసేలా వ్యవహరించడం బాధాకరమన్నారు. "వార్తలు రాసినందుకు కేసులు, ప్రశ్నించినందుకు అరెస్టులు చేస్తే సామాన్య ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి?" అని ఆయన ప్రశ్నించారు. జర్నలిస్టులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని సీపీఐ ప్యాపిలి మండల సమితి డిమాండ్ చేసింది. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు జర్నలిస్టులకు సీపీఐ అండగా నిలుస్తుందని మహేష్ స్పష్టం చేశారు.

## మహిళలకు శక్తి యాప్ పై అవగాహన



**డోన్ టౌన్, సెప్టెంబర్ 10,(సీమ కిరణం న్యూస్):** నంద్యాల జిల్లా ఎస్పీ డిఎస్పీల ఆదేశాల మేరకు డోన్ శక్తి టీం డోన్ టౌన్ సి. ఐ ఇంతియాజ్ భాష ఆధ్వర్యంలో కొత్తపేట దగ్గర మహిళలకు శక్తి యాప్ గురించి వివరిస్తూ ప్రస్తుతం మహిళల పై సమాజంలో జరిగే అత్యాచారాలు, మహిళల పట్ల ఇతరుల దురుసు ప్రవర్తన ల గురించి వెంటనే క్రింది నంబర్లకు 112 లేదా 100 కు ఫోన్ చేసి తెలపవచ్చునని, బాల్యవివాహాలు చేస్తున్నట్లుగా తెలిసినా 1098కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఏపీకే ఫైల్స్ మరియు ఫేక్ మెసేజ్లు వంటి సైబర్ నేరాలకు 1930 నెంబర్ కు సమాచారం ఇవ్వవలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది , మరియు శక్తి టీం మహిళ పోలీసులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీకగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ఘనంగా ముగిసిన వేడుకలు

పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు, ముస్లిం సోదరులు



**ప్యాపిలి సెప్టెంబర్ 10 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామంలో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జలదుర్గం ఎస్ఐ అనిల్ కుమార్, ఆర్ఈ నాగరాజు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులను అభినందించారు. మతాలకతీతంగా ముస్లిం సోదరులు సైతం వేడుకల్లో పాల్గొని భక్తులతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. గ్రామంలో ప్రజలంతా కలిసిమెలిసి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించడం ద్వారా మతసామరస్యం, సోదరభావం వెల్లివిరిశాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై కొరడా



**ప్యాపిలి సెప్టెంబర్ 10 (సీమ కిరణం న్యూస్) :** ప్యాపిలి మండలంలో రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్న సమాచారంతో అధికారులు చర్యలు చేపట్టారు. గత కొంతకాలంగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఆటోను అధికారులు పట్టుకుని సీజ్ చేశారు.రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన ఆర్ఐ, వీఆర్వోలు ఆటోను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై అధికారులు పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. రేషన్ బియ్యం అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్‌కు తరలింపును అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## సంగీత పాల్ జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం



**డోన్ టౌన్, సెప్టెంబర్ 10,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నందు గురువారం క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మండపేటకు చెందిన సహోదరి సంగీత పాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని మానవ సేవే మాధవ సేవ అనే ఉద్దేశంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి బంధువులకు, వైద్య సిబ్బందికి దాదాపు 200 మందికి పైగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. పుట్టినరోజు వేడుకలను ఆడంబరంగా చేసుకోవడం కంటే, పేదలకు, రోగులకు అన్నదానం చేయడం వల్ల ఎంతో సంతృప్తి లభిస్తుందని అన్నారు. సహోదరి సంగీత పాల్ గారు ఎల్లప్పుడూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుంటారని కొనియాడారు. ఆమెకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షుడు ఆదాం, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు సుధాకర్, ప్రశాంత్ రాజు, తదితర క్రైస్తవ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

